# "ఒరిగిపోయిన వంతెన"

త్రిలాభార దేశం పానకాల రాజు పాలనలో సస్యశ్యామలంగానూ, సుఖశాంతులతోనూ విరాజిల్లుతూ వుండేది. దేశానికి "ముఖ్య జలాధారమైన "రిదాగో" నది కాలవల ద్వారా అన్ని మూలలకి నీటి సంపద అందించినా రానురాను రోడ్డు రవాణాకి అంతరాయంగా పరిణమించింది.

కాబట్టి "రిదాగో" నదికి "కింమూరు" దగ్గర బ్రిడ్జి కట్టించడానికి పానకాలరాజుగారు నిర్ణయించి ప్రజాస్వామ్య పద్ధతితో టెండర్లు పిలిపించారు. దానితో పాటు పక్కనే వున్న కాలువ మీద వంతెన కూడా కావాలి కాబట్టి సదరు కాలువ మీద చిన్న వంతెన కట్టడానికి కూడా టెండర్లు కోరడమైనది.

ఈ లోగా పైపూరు దగ్గరవున్న పంటు మీద వాహనాలు దాటించుటకుగాను సర్కారు వారు టెండర్లు పిలిచి తద్వారా రవాణా సౌకర్యాలు పెంపొందించుటకు పథకాలు




రూపొందించారు. పెద్ద బ్రిడ్జిమీద మూడు కోట్లకి టెండరు పెటారు కంసుడుగారు వారి మేనల్లుడైన కృష్ణారావు చిన్న కాలువ మీద చిన్న బ్రిడ్జికి, పంటుమీద వాహనాలు దాటించడానికి చెరొక ముప్పయివేలకి సిద్ధం అయ్యాడు.

తాను రోడ్లమీద వ్యవహారం చేస్తూండగా తన మేనల్లుడు ముష్టి ముప్పయివేలకి ప్రయత్నించడం చాలా చిన్నతనం అన్పించింది. వెంటనే మేనల్లుడికి కబురు పెటి "ఇలా నువ్వు చిల్లరకోసం కక్కుర్తి పడ్డం నాకు నామోషీగా వుంది. కావాలంటే పెద్ద బ్రిడ్జి కంట్రాక్టులో పావలా వాటా ఇస్తాను. రా!" అని ఆహ్వానించారు కంసుడుగారు. "చిల్లరమీద చిన్నచూపు చూడకు మామా! నీకు అంతగా అవమానంగా వుంటే నేను నీ మేనల్లుడ్నని ఎవరికీ చెప్పకు." అని వెళ్ళిపోయాడు కృష్ణారావు.

పెద్ద బ్రిడ్జి కంట్రాక్టు కంసుడుగారికి, చిన్న బ్రిడ్జి మరియు పంటు ట్రాఫిక్ కంట్రాక్టు కృష్ణారావుకి ఇవ్వబడ్డాయి.

వీలైనంత త్వరలో పెద్ద బ్రిడ్జి పూర్తి చేసి పంటుమీద రవాణా దెబ్బకొట్టి మేనల్లుడికి గుణపాఠం నేర్పాలని కంసుడుగారు శ్రమించి చకచకా పని చేయించసాగారు.

"నదిమీద పెద్ద బ్రిడ్జి కట్టినా కాలవమీద కనెక్టింగ్ బ్రిడ్జి లేకపోతే ఏం లాభం? అని కృష్ణారావు మామగారు ఎంత తొందరగా పని చేయిస్తున్నారో అంత ఆలస్యం చేయసాగాడు. పెద్ద బ్రిడ్జి పూర్తికావచ్చినా చిన్న బ్రిడ్జి ఇంకా ప్రారంభదశలోనే వుండిపోయింది. పర్యవసానంగా వేరే మార్గాంతరంలేక వాహనాల రవాణా అంతా పంటుమీదనే ఆధారపడవలసి వచ్చింది. ఎద్దనుకున్నా లాభాలు అపరిమితంగా వచ్చిపడి పోసాగాయి

అల్లుడి తెలివి తేటలకి లోపల సంతోషించినా కంసుడిగారిలోవున్న అహంకారం ఆయన్ని రెచ్చగొట్టింది. ఎలాగైనా అతనికి బుద్ధి చెప్పాలని ఆయన పథకం వేశారు. "రిదాగో" నదిమీద "పైపూరు"



దగ్గర రోడ్డు కం రైలు బ్రిడ్జి నిర్మాణం చాలా అత్యవసరమని స్థానిక నాయకుల చేత, ప్రజలచేత మహజర్లు పెట్టించారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా పానకాలరాజుగారు అర్జంటుగా టెండర్లు పిలిపించారు. ఆ కంట్రాక్టుకూడ కంసుడుగారికే లభించింది చిన్న బ్రిడ్జి పూర్తి చెయ్యడం ఆలస్యంచేసి పంటుమీద లాభాలు గడిస్తున్న మేనల్లుడికి బుద్ధి చెప్పడం కోసం రోడ్ కం రైలుబ్రిడ్జి వేగంగా నిర్మించడానికి కంకణం కట్టుకున్నారు కంసుడుగారు.

కింమూరు దగ్గర కాలవమీద చిన్నబ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకుండానే 'పైపూరు' దగ్గర 'రిదాగో' నది మీద రోడ్ కం రైలు బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. రోడ్ కం రైలు బ్రిడ్జి మీద వెళ్ళే వాహనాల నుంచి ఆసీలు వసూలు చేయడానికి టెండర్లుకూడా పిలవడం జరిగింది.

రోడ్ కం రైలు బ్రిడ్జి టోల్‌గేటు దగ్గర వాహనాల ఆసీలు వసూలు చేసే కంట్రాక్టు కృష్ణారావుకి లభించింది.

కిందూరు దగ్గర చిన్నబ్రిడ్జి, పెద్దబ్రిడ్జి పూర్తవడంవల్ల పైపూరు దగ్గర రోడ్‌కు రైలుబ్రిడ్జి తయారవడంవల్ల పంటుమీద వాహనాల రవాణా తగ్గింది. అపరిమితమైన లాభాలకి అలవాటుపడిన కృష్ణారావు పంటుమీద ఆదాయం తగ్గేసరికి కొంచెం కంగారుపడినా పైకిమాత్రం చాలా నిబ్బరంగా కన్పించాడు

కంసుడుగారు మేనల్లుడికి కబురుపెట్టి "ఇప్పటికైనా మించిపోయిందిలేదు. బేరేజి కంట్రాక్టుకూడా నాకే వస్తుంది. అర్ధరూపాయి వాటా ఇస్తాను అమ్మాయినిచ్చి పెళ్ళి చేస్తానురా!" అని పిలిచారు. "ముప్పావలా వాటాయిస్తేగాని కిటదు" అని మొరాయించాడు కృష్ణారావు.

"నువ్వు సంపాదించిన చిల్లర - చిల్లరగానే పోతుంది. నీ పొగరుమొత్తనం తగ్గాక నువ్వే వచ్చి బతిమాలతావులే" అన్నాడు కంసుడుగారు కోపంగా.

"ఏదోరోజు నువ్వేవచ్చి నా కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తావు" అన్నాడు కృష్ణారావు నిబ్బరంగా.

"ఏం చూసుకుని ఇంత మిడిసిపడుతున్నావు? ఏది నమ్ముకుని ఇంత విర్రవీగుతున్నావు?" అని కంసుడుగారు కోపంతో ఆశ్చర్యపోయారు.

"నిన్నే నమ్ముకున్నాను మామయ్యా! నువ్వు సంపాదించేది నీ కూతురి కోసం కాదా? ఈలోగా నేనుకూడా కొంత సంపాదిస్తాను" అని వెళ్ళిపోయాడు కృష్ణారావు.

కొన్నాళ్ళకి కర్ణుడి రథంలా కంసుడుగారు కిందూరు దగ్గర "రిదాగో" నదిమీద కట్టిన పెద్ద బ్రిడ్జి పక్కకి ఒరిగిపోయింది. పర్యవసానంగా అటు వెళ్ళే వాహనాలుకూడా పైపూరు బ్రిడ్జిమీదనుంచే వెళ్ళాల్సి వచ్చింది. ఆసీలు వసూలుచేసే కృష్ణారావు అనతికాలంలోనే అంతులేని ఐశ్వర్యాన్ని సాధించాడు.

ముప్పావలా వాటాని, కూతుర్ని ఇచ్చి కాళ్ళు కడిగి కృష్ణారావుకి కంసుడుగారు కన్యాదానం చేశారు.

"ఒరే క్రిష్ణా! నీ ఆత్మవిశ్వాసం గొప్పదిరా!" అని మనస్ఫూర్తిగా మెచ్చుకున్నారు.

"ఆత్మవిశ్వాసం కాదు మామా! నేను మొదట్నించీ నిన్నే నమ్ముకున్నాను. నువ్వు కట్టిన బ్రిడ్జి ఎన్నాళ్ళు నిలబడుతుందో నాకు తెలియదా మామా" అన్నాడు అల్లుడు కృష్ణారావు, మామగార్ని మెచ్చుకుంటూ.

ఇద్దరూ కలిసి బరాజ్ కంట్రాక్టు చేసి సుఖముగా వర్ధిల్లసాగారు.

[నీతి: మామని అల్లుడు నమ్మినట్టు ప్రజలు ప్రభుత్వాన్ని నమ్మకోవాలి. నమ్మకాలే శాశ్వతం! బ్రిడ్జీలు అశాశ్వతం]

—తంబు